

విద్యార్థినికి మాత్రలు వేస్తున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, చిత్రంలో కలెక్టర్ ప్రతీక్ జైన్

# ప్రతి విద్యార్థి అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

**రాష్ట్ర శాసనసభాపతి, వికారాబా ద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్**

**సంఘం లక్ష్మీబాయి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పంపిణీ**

వికారాబాద్, జూన్ 20 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి విద్యార్థీ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబా ద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రైవేట్ బడులకు దీటుగా సర్కారు పాఠశాల లను బలోపేతం చేస్తుందన్నారు. బాలికలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికల రక్షణకోసం కాంపౌండ్ వాల్స్, పాఠశాలల్లో మౌలిక వసతు లు, దవాఖానలను ఏర్పాటు చేసి వికారాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో ముం దుండేలా చూస్తామన్నారు. ఏడాదిలో రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తారని.. జిల్లాలో 1-19 వయసున్న చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రా ల్లోని పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. మాత్రలు తీసుకొని వారికి తిరిగి ఈ నెల 27న కచ్చితంగా ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ విద్యార్థినులు శ్రద్ధ, క్రమశిక్షణతో చదువుకోవాల న్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు స్పీచ్ ఇవ్వగా ఉపాధ్యాయులు, స్టూడెంట్స్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్ కుమా ర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే సమాజంలో మార్పు : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ : విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని..తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం జాతీ య నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు, యూనిఫాంలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్, డీఈవో రేణుకాదేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవీంద్రయాదవ్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

### నివారణ మాత్రలు వేసి..

బడంగ్‌పేట : నులి పురుగుల నివారణకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం మహేశ్వరం మండలంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఆమె హాజరయ్యారు. అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు అల్బెండజోల్ మా త్రలు వేశారు. నివారణకు తీసుకోవాల్సిన అంశాలతో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



బడంగ్‌పేట : విద్యార్థినికి మాత్రలు వేస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 21 జూన్ 2024 | RANGAREDDY



'సమైక్య రాష్ట్రంలో వచ్చీరాని కరెంట్‌తో అష్టకష్టాలు పడ్డాం.. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక కంటికి కునుకు లేకుండా బావుల వద్ద పడిగాపులు కాసినం. ఎడాపెడా కోతలతో పంటలకు నీళ్లు సరిపోక వ్యవసాయం ఆగమైంది. రాత్రిపూట పొలాల దగ్గరకు వెళ్లి పాములు, తేళ్లు కుట్టి ఎందరో రైతులు ప్రాణాలు కోల్పోయిండ్రు. సాగునీళ్లు అందక పంటలు పండక ఎంతోమంది రైతులు అప్పులపాలై ప్రాణాలు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా దారుణమైన, దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపిందే కేసీఆర్. స్వరాష్ట్రాన్ని సాధించడమే గాక ముందుచూపుతో 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేసి వ్యవసాయానికి రంది లేకుంట చేసిండు. ఆయన వచ్చినంకనే కరెంట్ కష్టాలు తీరాయి' అంటూ రైతాంగం స్పష్టంచేస్తున్నది. తెలంగాణ రాకముందు అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చి రంది లేకుండా చేశారని గుర్తుచేసుకుంటున్నారు. ఇలా ఒక వ్యవసాయమే కాదు.. అన్ని రంగాలను గాడిన పెట్టి 'పవర్‌ఫుల్ తెలంగాణ'గా నిలబెట్టిన కేసీఆర్‌ను.. విద్యుత్ కొనుగోళ్ల విషయంలో బద్నాం చేయడం తగదని మండిపడుతున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), జూన్ 20

# నిన్న వెలుగులు నేడు వెతలు

**కరెంట్ కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దేనంటున్న అన్నదాతలు**

### పొలాల వద్ద పడిగాపులు కాసేటోళ్లం..



తెలంగాణ రాకముందు అరకొర కరెంట్‌తో రాత్రి, పగలు అన్నదాతలు పొలాల వద్ద పడిగాపులు కాసేటోళ్లం. స్వరాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడకూడదని కేసీఆర్ వ్యవసాయానికి నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేశారు. 70 ఏండ్ల కాలంలో కరెంట్ విషయంలో ఎవరూ సాధించలేనిది కేసీఆర్ సాధించి చూపించారు.

-పి. కుమార్‌యాదవ్, రైతు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

### పరిశ్రమలకూ నిరంతర కరెంట్..



తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత విద్యుత్తు వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి రైతులు, పరిశ్రమలకు నిరంతరం విద్యుత్తు అందించిన గొప్ప నేత కేసీఆర్. దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నది. పరిశ్రమలకు పవర్‌హాలిడేల కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దే.

-మాలెల వెంకటయ్య, శ్రీ విశాలాక్షి ఇండస్ట్రీస్ కులకచర్ల

### కేసీఆర్ పాలనలో నాణ్యమైన విద్యుత్..



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాలనలోనే వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందింది. అంతకుముందు బావుల దగ్గర కరెంట్ ఎప్పుడు పోయేదో తెలువకపోతుండేది. కరెంట్ కోసం పొలాల దగ్గర నిద్రపోయిన రోజులు ఇంకా గుర్తున్నాయి. రాష్ట్రం వచ్చినంక కేసీఆర్ వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ అందించడంతో రైతులంతా ఆనందంగా వ్యవసాయం చేసుకున్నారు. కాంగ్రెస్ పాలనలో త్రీ ఫేజు కరెంట్‌లో కోత విధిస్తుండటంతో పొలాలకు సరిపడా నీరు అందడంలేదు. విద్యుత్ విషయంలో కేసీఆర్ సార్‌ని బద్నాం చేయడం సరికాదు.

-శ్రీనూనాయక్, రైతు, కడ్తాల్ మండలం

### కేసీఆర్ కృషితోనే నాణ్యమైన విద్యుత్తు అందింది..



ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోతలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. పగటిపూటతో పాటు రాత్రిపూట సైతం విద్యుత్ కోతలు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినంక కేసీఆర్ కరెంట్ కష్టాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గృహ వినియోగదారులతో పాటు వ్యవసాయానికి 24గంటల నిరంతర కరెంట్ సరఫరా చేశారు. 70 ఏండ్ల కాలంలో ఏ ప్రభుత్వాలు, ఏ ముఖ్యమంత్రులతో కానీ పని కేసీఆర్‌తో సాధ్యమైంది. కరెంట్ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయడానికి ప్రయత్నాలు చేయడం మంచి పద్ధతి కాదు. అన్ని వర్గాల ప్రజల గురించి ఆలోచించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు.

-ఎండీ చాంద్‌పాషా, హైతాబాద్, షాబాద్ మండలం

### ఇండ్లకూ సరిగా విద్యుత్తు ఇస్తలేరు..



కేసీఆర్ విద్యుత్తు కొరతను అధిగమించి వ్యవసాయానికి నిరంతర కరెంట్‌ను అందించారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. కనీసం ఇండ్లకూ నాణ్యమైన విద్యుత్తు ఇచ్చే స్థితిలో కాంగ్రెస్ పాలకులు లేరు. పదేపదే కరెంటు పోతుండడంతో పంటలకు సాగు నీరు అందడం లేదు. దీంతో ఇటు రైతులు, అటు ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ఇప్పటినుంచైనా నాణ్యమైన విద్యుత్తును అందించాలి.

-పొట్టిపల్లి రాంరెడ్డి, రైతు, నాగులపల్లి, పెద్దేముల్ మండలం

### బీఆర్‌ఎస్ హయాంలోనే రైతులకు మేలు ..



తెలంగాణ రాకముందు కరెంట్ లేకపోవడంతో రైతులు వ్యవసాయం చేయాలంటే భయపడే పరిస్థితి ఉండేది. స్వరాష్ట్రంలో ఒక రైతుబిడ్డగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు వ్యవసాయానికి 24గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేశారు. నాడు దండగ అన్న వ్యవసాయం కేసీఆర్ వచ్చినంక పండుగలా మారింది. కరెంట్, నీళ్లు లేక బీడుబారిన పొలాలు బీఆర్‌ఎస్ హయాంలో పచ్చని పంటలతో కళకళలాడాయి. కరెంట్ సరఫరా విషయంలో కేసీఆర్ రైతులకు ఎంతో మేలు చేశారు. గృహ వినియోగదారులకు సైతం 24గంటల కరెంట్ సరఫరా చేసి, విద్యుత్ కోతలకు చెక్‌పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.

-సింగప్పగూడెం నర్సింహులు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

### కాంగ్రెస్ రాకతో కోతలు మొదలయ్యాయి..



కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రత్యేక చొరవ తీసుకొని తెలంగాణ రాష్ట్రంలో నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తును అందించారు. ముఖ్యంగా రైతుల పంటల సాగుకు 24 గంటల ఉచిత కరెంటును అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంట్ కోతలు మొదలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు కేసీఆర్‌ని బద్నాం చేసుడు మాని.. విద్యుత్తు సరఫరాపై దృష్టి సారించాలి.

-ఎం.వెంకట, పెద్దేముల్

# ఎన్నాళ్లీ ప్రదక్షిణలు..

- ధరణి దరఖాస్తులకు మోక్షమెప్పుడో..?
- భూ సమస్యలతో రైతులు సతమతం
- రెవెన్యూ అధికారుల చుట్టూ అన్నదాతల చక్కర్లు
- వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో 10 వేలకుపైగా ధరణి దరఖాస్తులు
- అధిక మొత్తంలో టీఎం-33 అప్లికేషన్లే..
- చాలాకాలంగా పెండింగ్‌లో డేటా కరెక్షన్ ..
- ధరణి ఆపరేటర్ల తప్పిదాలతో అన్నదాతలకు అదనపు కష్టాలు
- కలెక్టర్ స్థాయిలో అప్రూవల్ అయినా... టెక్నికల్ సమస్యతో పెండింగ్
- టెక్నికల్ సమస్యలను పట్టించుకోని సీసీఎల్ఏ

వికారాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి భూ సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత ఆరు నెలలుగా రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాల ను ంచి కలెక్టరేట్ వరకు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. వికారాబాద్ జిల్లాలో 10 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అత్యధికం టీఎం-33 దరఖాస్తులే .. మరోవైపు ఆర్ఎస్ఆర్ సమస్యతోనూ పెండింగ్ మ్యుటేషన్, సక్సేషన్ తదితర దరఖాస్తులూ పరిష్కారానికి నోచుకోవడం లేదు. మరోవైపు కలెక్టర్ స్థాయి లో ధరణి దరఖాస్తులు అప్రూవల్ అయినా టెక్నికల్ సమస్యతో ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని సీసీఎల్ఏ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడంలేదని జిల్లా రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. కొత్త మార్గదర్శకాల జారీ పేరిట ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి అవసరమైన ఆప్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

మరోవైపు ధరణి పోర్టల్‌పై నియమించిన కమిటీ కొన్ని కొత్త ఆప్షన్లు సూచించడంతో అన్నదాతలకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ అనంతరం తహసీల్దార్లు రిపోర్టు ఇచ్చినా మళ్లీ ఆర్డీవోలు, రెవెన్యూ అదనపు కలెక్టర్, తదనంతరం కలెక్టర్ ఆమోదం తప్పనిసరి చేయడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీసీఎల్ఏ జారీ చేసిన నూతన మార్గదర్శకాలతో కాలయాపనే తప్ప మేలు జరుగదని రైతుల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అంతేకాకుండా కేవలం ఒకట్రెం డు ఆప్షన్లు మినహా మిగతా ఆప్షన్లకు తహసీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్‌కు తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో రెండు, మూడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

### పెండింగ్‌లోనే డేటా కరెక్షన్ ..

ధరణి ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పట్టా భూములు కూడా అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూములుగా ధరణిలో తప్పుగా ఎంట్రీ కావడంతో ఏండ్లుగా కార్యాలయాల చుట్టూ అన్నదాతలు తిరుగుతున్నా ఫలితం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం సంబంధిత భూమికి చెందిన రికార్డులు అన్ని పట్టా భూమిగా చూపుతున్నా పరిష్కారం మాత్రం జరుగడం లేదు. సంబంధిత భూమి పట్టా భూమిగా తహసీల్దార్లు రిపోర్టు ఇచ్చి కలెక్టర్ ఆమోదం తెలిపినా సీసీఎల్ఏ అధికారులు మాత్రం సంబంధిత ఫైళ్లను పెండింగ్‌లోనే పెడుతున్నారు. సీసీఎల్ఏలో రిపోర్టులను లెక్కచేయకుండా డబ్బును పరిగణనలోకి తీసుకొని టీఎం-33 దరఖాస్తులను పరిష్కరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తహసీల్దార్ స్థాయిలోనే పట్టా భూమి అసైన్డ్ లేదా భూదాన్, వక్ఫ్ భూమిగా తప్పుగా ఎంట్రీ అయిందని గుర్తించినప్పుడు కింది స్థాయిలోనే ఎందుకు పరిష్కరించడం లేదనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది. సీసీఎల్ఏకు అధికారాలు అప్పజెప్పడంతో ధరణి దరఖాస్తులకు మోక్షమెప్పుడో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఉన్న భూమి కంటే ఎక్కువ లేదా తక్కువ భూమి ఉన్నట్లు ధరణి ఆపరేట ర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతో ఆర్ఎస్ఆర్ సమస్య ఉత్పన్నమైనది. దీని పరిష్కా రానికి రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాత రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లలో ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను తెలుసుకొని ఆర్ఎస్ఆర్ సమస్యను పరిష్కరించొచ్చు.. కానీ, ధరణిలో ఎంట్రీ అయిన వివరాలను ప్రమాణికంగా తీసుకొని అధికారులు ఆర్ఎస్ఆర్ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వెళ్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల పేరిట ఎక్కువ భూమి ఉన్నట్లు ధరణిలో ఎంట్రీ కావడంతో గుర్తించడం పెద్ద కష్టంగా మారడంతోపాటు సంబంధిత రైతులు సహకరించకపోవడంతో ఆర్ఎస్ఆర్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అయితే ఈ సమస్యల పరిష్కా రానికి ధరణి పోర్టల్‌లో మరిన్ని ఆప్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

### కలెక్టర్ అప్రూవల్ చేసినా..

నాకు పూడూరు మండలం, గట్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 112/ఉ లో 30 గుంటల భూమి ఉన్నది. ఆ భూమికి సంబంధించి నా పేరిట పాసు పుస్తకాలు కూ డా వచ్చాయి. అయితే ధరణిలో మాత్రం ఆ భూమి నా తండ్రి బాలయ్య పేరిట తప్పుగా ఎంట్రీ అయ్యింది. దానిని నా పేరిట సరిచేసుకునేందుకు గత ఆరు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. తహసీల్దార్‌తో సహా కలెక్టర్‌కు కూడా అప్లికేషన్‌ను అందజేశా. అయితే పది రోజుల క్రితం నేను పెట్టుకున్న దరఖాస్తును కలెక్టర్ అప్రూవల్ చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. కానీ, ఇంకా ధరణిలో మాత్రం నా తండ్రి పేరునే ఆ భూమి ఉన్నది. రెవెన్యూ అధికారులను అడిగితే టెక్నికల్ సమస్యతో పెండింగ్‌లో ఉందని.. త్వరలోనే పరిష్కారం అవుతుందని చెబుతున్నారు. దయచేసి నా భూసమస్యను పరిష్కరించాలి

-మంగలి పుల్లయ్య, మేడిపల్లి, పూడూరు మండలం



- ఈ నెల 19తో ముగిసిన బడిబాట కార్యక్రమం
- రంగారెడ్డి జిల్లాలోని బడుల్లో చేరిన విద్యార్థులు అరకొరే
- ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య 7,697 మందే
- గతేడాది కంటే తగ్గిన ప్రవేశాలు
- ప్రభుత్వం సరిగా దృష్టి పెట్టకపోవడమే కారణం!

# మొక్కుబడి..

రంగారెడ్డి, జూన్ 20 (నమస్తే తెలంగాణ): జిల్లాలో విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమం మొక్కుబడిగానే ముగిసింది. ఈ నెల 6న ప్రారంభమైన ప్రోగ్రామ్ ఈనెల 19తో ముగిసింది. ఈ సందర్భంగా 7,697 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పొందినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గతేడాదితో పోలిస్తే ప్రవేశాల సంఖ్య తక్కువగా ఉన్నది. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టకపోవడం..ఇందులో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం సైతం అంతంత మాత్రంగానే ఉండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల మొగ్గు చూపనట్లు తెలుస్తున్నది.

### గతేడాది కంటే ఈసారి తక్కువే ..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా విద్యాశాఖ ప్రతి ఏటా స్కూళ్లు తెరిచిన తర్వాత బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. అయితే ఈసారి గతానికి భిన్నంగా విద్యార్థులు అరకొరగానే బడిబాట పట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. మన ఊరు-మన బడి కార్యక్రమంతో అనేక మౌలిక వసతులను కల్పించింది. ఇదే క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం 'అమ్మ ఆదర్శ కమిటీ'లను ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టింది. కానీ..చాలా వరకు పాఠశాలల్లో నేటికీ పూర్తికాక అస్తవ్యస్థంగా ఉన్నాయి. మరోపక్క పాఠశాలలు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీకి ప్రభు త్వం చర్యలు తీసుకున్నా ఆశించిన స్థాయిలో ప్రవేశాలు జరుగకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తున్నది. గతేడాది బడిబాట కార్యక్రమంలో 10,228 మంది ప్రవేశాలు పొం దారు. కానీ..ఈసారి 7,697 మందికే పరిమితమైంది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటోతరగతిలో చేరిన వారు 4,245 మంది ఉండ గా.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చిన వారు 339 మందే ఉన్నారు. వారంతటగా వారే వచ్చి చేరిన విద్యార్థులు 3,113 మంది ఉన్నారు.

### దృష్టి సారించకపోవడమే కారణం..

కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన, సాం కేతిక విద్యవంటి అనేక విభిన్న పద్ధతులను ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బడిబాట కార్యక్రమంపై సరిగ్గా దృష్టి పెట్టకపోవడం..అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం మొక్కుబడిగానే పాల్గొనడంతో విద్యార్థుల నుంచి స్పందన అంతగా రాలేకపోయింది. మరోవైపు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగడం..బదిలీల హడావిడి నెలకొన్న నేపథ్యంలో ఉపాధ్యాయులు అనుకున్న స్థాయిలో దృష్టి సారించలేకపోయారు. ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీలను భాగస్వామ్యులను చేయడంలోనూ విఫలమయ్యారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమం ఈసారి మొక్కుబడిగానే సాగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగుపడ్డ వసతులు, బోధనా నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ఇంటింటికెళ్లి చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చే దిశగా చొ రవ చూపలేకపోయారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకుల్లో ప్రతిభ కనబర్చడం, ట్రిపుల్ ఐటీ, జాతీయ ఉపకార వేతనాలకు అర్హత పొందడంలోనూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ముందు వరుసలో ఉంటున్నారన్న విషయాన్ని వారికి సమగ్రంగా వివరించలేకపోయారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ వంటి విషయాలను సవివరంగా వివరిస్తే..చాలావరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపేవారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. 'బడిబాట'ను మరి కొన్ని రోజులు కొనసాగించి, ప్రవేశాలు ఆశాజనకంగా ఉండేలా చర్యలు చేపడతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.